# ఈ మార్పుకి కారణం?

యం. యస్. చలం

శేషాచలం చాలా మంచివాడు నేను మహా కష్ట దశలో వుండగా వందరూపాయిలు అప్పిచ్చాడు. నా భార్యకు జ్వరం, కొడుకు చదువుకి జీతం కట్టాలి. పెద్దకూతురికి సొరె పంపాలి. చిన్న అల్లుణ్ణి పండుక్కి తీసుకురావాలి. ఇన్ని అవాంతరాలు ఒక్కసారి వచ్చిపడ్డాయి.

ఎంతమందినో ఋణ మడిగాను. ఒక్కరూ ఒక్కకానీ యివ్వలేదు. శేషాచలం ఒక్కడే మిగిలాడు. అడగడానికి యిష్టంలేదు. మరి అడక్క తప్పనూలేదు. అడిగాను. మాట తీసెయ్యకుండా అడిగినంతా యిచ్చి వూరుకున్నాడు. జీవితమంతా అతనికి కృతజ్ఞత చూపినా నా ఋణం తీరదు కదూ?

అయితే నేను కృతజ్ఞుణ్ణి కాలేదు. పైపెచ్చు కృతఘ్నుణ్ణయ్యాను. అతనిచావిడి కాలిపోతే ఇల్లు కూడా కాలితే పోవు ననుకున్నాను. గేదెచస్తే యెద్దు యెందుకు మిగిలాయా అని యేడ్చాను. అతనికొడుక్కి జ్వరంవచ్చి నయమైతే చస్తే పీడా పోవు ననుకున్నాను.

అదేమిటయ్యా అంత విపరీతం అనకండి! విపరీతమే మరి! ఎందుకు కాదూ!

ఒకప్పుడు శేషాచలం నాలో యెన్నోవంతు! యెన్నిసార్లు అతనికి నేను అప్పిచ్చాను! అయితే యేం? పరిస్థితులు తారుమారై అతను నాస్థానంలో కూర్చుంటే నేనతని స్థానంలోకి దిగజారిపోయాను. ఈనాడు అతనుదాత, నేను యాచకుణ్ణి. అదే నాకు మంట, అసూయ, ద్వేషం. ఏంతప్పా? లోకంలో యెంతమంది ద్వేషించడంలేదు? ధనవంతుణ్ణి పేదవాడూ, యజమానిని కూలీ; అన్నను తమ్ముడూ, అత్తను కోడలూ...యిలా యెంతైనా వ్రాసుకోగలను.

కొంతకాలం గడిచింది. శేషాచలం అప్పు తీర్చనేలేదు. మళ్ళీ డబ్బు అవుసరం వచ్చింది. యెవ్వరూ యివ్వలేదు. మళ్ళీ శేషాచలమే. నాగతి! ఎలా యిస్తాడు? అయినా యెలా అడగను? ముఖం చెల్లొద్దూ?

అడక్క తప్పలేదు. అడిగాను. యిదివరకటి డబ్బు యివ్వందే యెలా యిస్తాను అనలేదు. ఎంత కావాలి అన్నాడు. యాభై చాలా అన్నాడు. చాలన్నాను. తీసుకొచ్చి యిచ్చాడు. ఈసారి నోటుకూడా వ్రాయించుకోలేదు. వ్రాసి యిస్తానంటే అక్కర్లేదన్నాడు. పైగా నాముఖం నేనే పోల్చుకోలేనంతగా మారిపోయింది. నా మార్పు అతను గమనిస్తాడేమో అని చరచరా యింటికి నడిచిపోయాను.

ఇప్పుడు అతనంటే నాకు అసూయాలేదు. ఆవేశమూలేదు. ద్వేషమూలేదు. వాటిస్థానే గౌరవం లజ్జ నిలబడ్డాయి. ఏవిటో యీమార్పుకు కారణం మరి? ఎవరి మానసిక బలహీనతో?

## ఆనందవాణి

*

రచయితలు చాలామంది తాము పంపించే రచనలు ప్రకటింపబడతాయో లేదో తెలియక చాలా తహతహపడుతూ వుంటారు.

మీ రచనలతో బాటు పోస్టుబిళ్ళలు కూడా పంపిస్తే సాధ్యమైనంతత్వరలో, ప్రకటించేదీ లేనిదీ తెలియబరుస్తూ, ప్రకటించడానికి వనులలేనియెడల సదరు రచనలు త్రిప్పి పంపబడును.

ఆనందవాణికి ఏజంట్లు, చందాదార్లు మొదలయినవారు పంపించే మనియార్డర్లు వ్యక్తులపేరగాకుండా "మేనేజరు, ఆనందవాణి, నెం. 12, తంబుచెట్టి వీధి, మద్రాసు" అని వ్రాసి పంపవలెను.